
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

మంగళవారం 20 మే 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎమ్: 9985411154

వానొస్తుంది.. జాగ్రత్త: ఆర్డీఓ

ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం డివిజన్ పరిధిలోని అన్ని తహసీల్దారు కార్యాలయాలలో కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఫోన్ నంబరు 9866057959 అందుబాటులో ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో సంప్రదించాలని సూచించారు.

మినీ మహానాడును విజయవంతం చేయండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

పుట్టపర్తి రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మామిళ్ళకుంట కూడలిలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఈ నెల 24న జరిగే మినీ మహానాడును విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లాస్థాయి మినీ మహానాడును కుటుంబ కార్యక్రమంగా భావించి పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జిల్లా వాల్మీకి సాధికార సమితి అధ్యక్షుడు బోయ రామాంజినేయులు, జిల్లా వడ్డెర సాధికార సమితి అధ్యక్షులు వడ్డే రవీంద్ర, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, ఉపాధ్యక్షుడు కోగర నరసింహ, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, జనరల్ సెక్రటరీ కళ్యాణ్, తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

హస్త కళలకు మంచి రోజులు

- మంత్రి సత్యకుమార్



ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): హస్తకళలకు అవసరమైన ముడి పదార్థాల డిపోను ధర్మవరంలో ఏర్పాటు చేయాలని కోరుతూ రాసిన లేఖకు కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పదించారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. గత నెల 30న తాను రాసిన లేఖకు స్పందించిన కేంద్ర మంత్రి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ ఈ నెల 13న సంబంధిత శాఖకు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ధర్మవరంలో ముడిపదార్థాల డిపో ఏర్పాటు కోసం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ టెక్నాలజీ సపోర్టు స్కీం ఫర్ హ్యాండీక్రాఫ్ట్ కింద ఆమోదం కోరామని మంత్రి తెలిపారు. ముడి పదార్థాల డిపో ఏర్పాటైతే ధర్మవరం హస్తకళ రంగానికి విశేషంగా మేలు జరుగుతుందని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలైతే వేలాది మంది కళాకారులకు నాణ్యమైన ముడిపదార్థాలు తక్కువ ధరకు, సమయానికి అందుతాయని, వారి జీవనోపాధికి స్థిరత్వం కలుగుతుందని తెలిపారు.

కదిరి పీఠంపై టీడీపీ

- మున్సిపల్ చైర్‌పర్సన్‌గా దిల్‌షాదున్నీసా
- వైస్ చైర్మన్లుగా మద్దేపల్లి రాజశేఖర ఆచారి, సేగు సుధారాణి
- ఎన్నికకు గైర్హాజరైన వైసీపీ కౌన్సిలర్లు

6

కదిరి టీడీపీ కైవసం

● మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా దిల్‌షాదున్నీషా ● వైస్ చైర్మన్లుగా మద్దేపల్లి రాజశేఖరాచారి, సేగు సుధారాణి ● ఎన్నికకు గైర్హాజరైన వైసీపీ కౌన్సిలర్లు

కదిరి, మే19(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా దిల్‌షాద్ దున్నీషా, వైస్ చైర్మన్లుగా మద్దేపల్లి రాజశేఖర ఆచారి, సేగు సుధా రాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం ఉదయం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల ఎన్నికకు సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఆర్డీవో వీవీ ఎస్ శర్మ, ఉప అధికారిగా కమిషనర్ కిరణ్‌కుమార్ వ్యవహరించారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్‌అఫిషియో మెంబర్‌తో కలిపి మొత్తం 37మంది ఉన్నారు. వీరిలో టీడీపీకి చెందిన 25మంది సభ్యులు హాజరుకాగా, 11మంది వైసీపీ కౌన్సిలర్లు హాజరుకాలేదు. సమావేశం నిర్వహించడానికి అవసరమైన కోరం ఉండటంతో ఎన్నికలను నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా 10వార్డు కౌన్సిలర్ దిల్‌షాద్‌దున్నీషా, వైస్ చైర్మన్లుగా 19 వార్డు కౌన్సిలర్ మద్దెపల్లి రాజశేఖర ఆచారి, 21 వార్డు కౌన్సిలర్ సేగు సుధారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లకు డిక్లరేషన్ అందజేసి, వారిచేత ఎన్నికల అధికారి ప్రమాణం చేయించారు. ఎన్నిక అనంతరం టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నాయి. ఎన్నికైన వారు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నివాసానికి వెళ్లి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

కందికుంట వ్యూహంతో...

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వ్యూహంతో కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం టీడీపీకి దక్కింది. గతంలో ఐదుగురు మాత్రమే టీడీపీ తరఫున కౌన్సిలర్లుగా గెలించారు. అయితే ఎన్నికల ముందు ఇండిపెండెంట్ సభ్యుడు, ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 12కు పెరిగింది. ఎన్నికల తరువాత వైసీపీ కౌన్సిలర్లు 14మంది, అప్పటి చైర్‌పర్సన్ నజీమున్నీషాపై తిరుగుబాటు చేశారు. అనంతరం టీడీపీతో కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సిద్ధమయ్యారు. దానిని అవకాశంగా మలుచుకున్న ఎమ్మెల్యే అవిశ్వాసన తీర్మానానికి రంగం సిద్ధం చేశారు. టీడీపీలో ఉన్న 12మంది, వైసీపీలో ఉన్న 13మందిని కలుపుకుని అవిశ్వాస తీర్మానం నెగ్గించారు. అనంతరం చైర్మన్ ఎన్నిక సందర్భంగా తిరుగుబాటు వైసీపీ కౌన్సిలర్లు 13మంది టీడీపీలోకి చేరారు.



చైర్‌పర్సన్‌గా ఎన్నికైన దిల్‌షాదున్నీషా



వైస్ చైర్‌పర్సన్ సేగు సుధారాణి



వైస్ చైర్మన్ మద్దేపల్లి రాజశేఖరాచారి

సమావేశాలకు వైసీపీ వచ్చేనా..?

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన 11మంది వైసీపీ కౌన్సిలర్లు ఎవరు హాజరు కాలేదు. గతంలో వైసీపీకి 30మంది కౌన్సిలర్ల ఉండే వారు. ఆ ఆపార్టీ నుంచి ఏకంగా 19మంది కౌన్సిలర్లు, వైసీపీకి మద్దతిచ్చిన ఇండిపెండెంట్ కూడా టీడీపీలో చేరారు. ఉన్న వారు సమావేశాలకు హాజరు కాకపోవడంతో మున్సిపల్‌కౌన్సిల్‌లో వైసీపీ ఖాళీ అయిందని పలువురు చర్చించుకుంటున్నారు. భవిష్యత్‌లో సాధారణ సమావేశాలకు హాజరవుతారా లేదా అనే సందేహాన్ని కూడా వ్యక్తం చేస్తున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్

అర్జీల పరిష్కారంపై అలసత్వం వద్దు

కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 460 అర్జీలు



ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

అనంతపురం టౌన్, మే19 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కొనసాగింది. జిల్లా నలు మూలల నుంచి బాధితులు తరలిరావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. మొత్తంమీద 460మంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు ఇచ్చారు. కలెక్టరుతో పాటు జేసీ శివనారాయణశర్మ, డీఆర్‌ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, తిప్పేనాయక్, ఆనంద్, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారానికి ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ సూచించారు ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలపట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

● ప్రభుత్వం సాధారణ బదిలీలకు అనుమతించిందని, నిబంధనల మేరకే ప్రతిశాఖలో నిర్వహిస్తామని కలెక్టరు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆయాశాఖల ఉన్నతాధికారులు తమ పరిధిలోని ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు అతిక్రమించకుండా బదిలీలు చేపట్టాలన్నారు.

● ప్రభుత్వ శాఖల పరిధిలో కాలం చెల్లిన వాహనాలు ఉంటే వాటిని వేలం వేయాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. జిల్లా రవాణాశాఖకు లేఖ రాస్తే మోటారు వాహన ఇన్‌స్పెక్టరు వచ్చి ఆ వాహనం విలువ తదితర అంశాలు తెలియజేస్తారన్నారు. ఆ తర్వాత వేలానికి ఆహ్వానించి వాహనాలు అమ్మి, వాటి వివరాలు రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈవేలం ప్రక్రియ జూన్ 20నాటికి పూర్తిచేయాలని కలెక్టరు ఆదేశించారు.



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా చక్రస్నానం

ఉరవకొండ, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, అర్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉద్భవలక్ష్మి అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న మండపంలో శాస్త్రోక్తంగా ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేశారు. అనంతరం అర్చకులు వసంతాలు చల్లుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌బాబు, అర్చకులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అమిలినేని

పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, అర్చకులు.. ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆయన పేరిట అర్చన, పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

టెన్త్ సప్లిమెంటరీకి 975 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మే 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు తొలిరోజు సోమవారం 975 మంది గైర్హాజరైన ట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 42 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. రెగ్యులర్ విద్యార్థులు 2,975 మందికిగాను 2,039 మంది హాజరు కాగా.. 936 మంది గైర్హాజరయ్యారన్నారు. ప్రైవేటు విద్యార్థులు 68 మందికిగాను 29 మంది హా జరుకాగా.. 39 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. అధికారులు, ఫ్ల యింగ్ స్క్వాడ్ బృందాలు 21 కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

ముచ్చటగా మూడోసారి..!

● రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదా

● హాజరుకాని వైసీపీ ఎంపీటీసీలు

రామగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక ముచ్చటగా మూడోసారి వాయిదాపడింది. సోమవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని అధికారులు అన్ని ఏర్పా ట్లు చేశారు. ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడంతో ఎంపీపీ ఉప ఎన్నికను నిరవధింగా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవ య్య ప్రకటించారు. మార్చి 27వ తేదీ ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించగా వైసీపీ సభ్యులు గైర్హాజరయ్యారు. మరుసటి రోజు 28వతేదీ ఎన్నికను నిర్వహించగా నాటకీయ పరిణామాలతో వైసీపీ ముఖ్యనాయకుల సూచనలతో సభ్యులు హాజరు కాలేదు. ఓటమి భయంతో వైసీపీ నాయకులు క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. టీడీపీలో చేరిన మహిళా సభ్యురాలిని కూడా తిరిగి వారే తీసుకెళ్లారు. సోమవారం ఉదయం 10గంటలకు ఎన్నికల నిర్వహణకు అధికారులు రాగా.. మొదట టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు, వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఇద్దరు సభ్యులు వచ్చారు. 15 నిమిషాల తరువాత వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మరో సభ్యుడు వచ్చాడు. ఎన్నికల అధికారులు 11 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు పెట్టారు. మహిళలకు రిజర్వు చేసిన ఎంపీపీ స్థానానికి.. మహిళా అభ్యర్థులు హాజరు కాలేదు. సమయం ముగిసేవరకు చూసిన అధికారులు.. మహిళా అభ్యర్థులు ఎవరూ రాకపోవడంతో ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య ప్రకటించారు. ఎన్నిక సందర్భంగా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐల తోపాటు మొత్తం 238 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్ బందోబస్తును పర్యవేక్షించారు.



హాజరైన ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు

ఎన్ఎస్ గేటులో భారీ బందోబస్తు

చెన్నేకొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక నేపథ్యంలో చెన్నేకొత్తపల్లి మండలంలోని ఎన్ఎస్ గేటు వద్ద సోమవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగిరి వైపు వెళ్లే రహదారిలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. చెన్నేకొత్తపల్లిలో న్యామద్దల రోడ్డు, జాతీయ రహదారి కూడలిలో ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఎన్ఎస్ గేటులో బందోబస్తులో పోలీసులు

ఎంపీపీగా సోముశేఖర్ రెడ్డి

గాండ్లపెంట, మే 19(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా ఉత్కంఠ రేపిన ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎంపీపీగా గజ్జల సోముశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి విజయకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాల్సి ఉండగా, సోముశేఖర్ రెడ్డి, జయరామకృష్ణారెడ్డి, భారతి, గంగోజమ్మ మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీగా సోముశేఖర్‌రెడ్డిని జయరామిరెడ్డి ప్రతిపాదించగా, భారతి బలపరిచారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం ఎంపీపీగా గజ్జల సోముశేఖర్‌రెడ్డికి డిక్లరేషన్ పత్రాన్ని అందచేసి, ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ బాబురావు, ఆర్ఐ అశోక్ తదితరులున్నారు.

ఎంపీపీకి ఘన సన్మానం

ఎంపీపీ బాధ్యతలు స్వీకరించిన సోముశేఖర్‌రెడ్డికి ఎంపీడీఓ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. ఎంపీపీని పలువురు పూలమాలలు, శాలువతో సన్మానించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌వరకు ఎంపీపీ ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ కొండయ్య, మాజీ సింగ్‌విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, సర్పంచ్ రహంతుల్లా, శివప్పనాయుడు, సిద్ధారెడ్డి, చంద్ర, నరసింహులు, రామాంజులరెడ్డి, అక్రమ్ బాషా, మాజీ సర్పంచ్‌లు ప్రసాద్, కాకార్ల రవీంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గజ్జల సోముశేఖర్‌రెడ్డి, అనంతరం సమావేశంలో ప్రసంగిస్తున్న దృశ్యం

విద్యతోనే ఉన్నత స్థానాలకు..

విప్ కాలవ, ఎంపీ అంబికా

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న విప్ కాలవ, ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్/సెంట్రల్, మే 19(ఆంధ్రజ్యోతి): విద్యతో ఉన్నత స్థానాలకు చేరవచ్చని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. వాల్మీకి ఉ ద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో ప దో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వాల్మీకి వి ద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం స్థానిక వా ల్మీకి భవన్‌లో నిర్వహించారు. విప్, ఎంపీ మాట్లాడుతూ.. పవిత్ర రామాయణ ఇతిహాసాన్ని భారతజాతికి అందించిన వాల్మీకి వారసులుగా చెప్పుకునేలా చదువుకు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. పట్టుదలతో కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని సూచించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ట్యాబ్‌లను విప్ కాలవ శ్రీనివాసులు వ్యక్తిగతంగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఆర్‌సీ అక్కులప్ప, చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, రిటైర్డ్ డీఎఫ్ఓ ఆదినారాయణ, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, మాజీ కార్పొరేటర్ తలారి ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ప్రారంభం

తొలిరోజు 90శాతం హాజరు

అనంతపురం సెంట్రల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈఏపీసెట్-20 25 సోమవారం ప్రారంభమయ్యాయి. 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమింగ్. 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలుంటాయి. అనంతపురంలో ఐదు, తాడిపత్రిలో రెండు, గుత్తి, పుట్టపర్తిలో ఒకటి చొప్పున మొత్తం 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,021 మంది విద్యార్థులకుగాను 2,730 మంది పరీక్షలు రాసినట్లు ని ర్వాహక అధికారులు తెలిపారు. హాజరు శాతం 90.37 నమోదైనట్లు పేర్కొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గంలో అనంతకు చోటు

కార్యవర్గ సభ్యుడిగా సంతోష్‌కుమార్



అనంతపురం విద్య, మే 19(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గంలో జిల్లాకు చోటు దక్కింది. జాతీయ కార్యవర్గ సభ్యుడిగా జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్‌ను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం వెల్లడించారు. తిరుపతిలో నిర్వహించిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో కొత్తగా జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేస్తున్న తనకు జాతీయ కార్యవర్గసభ్యుడిగా అవకాశం కల్పించారన్నారు. రాష్ట్రం నుంచి ఆరుగురికి అవకాశం దక్కిందని ఆయన వెల్లడించారు.

మామిడి మాటున విషం..!

● కార్బైడ్‌తో మాగబెడుతున్న వ్యాపారులు

● పట్టించుకోని ఆహార భద్రతాధికారులు

పుట్టపర్తిరూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఫలరాజుగా ప్రసిద్ధిగాంచిన మామిడిపండ్లను ఇష్టపడని వారుండరు. ప్రస్తుతం మామిడిపండ్ల సీజన్ కావడంతో ఎక్కడ చూసినా విక్రయిస్తున్నారు. మంచి రంగును చూసి మైమరిచి ఎంతధరైనా కొనితీసుకెళ్తున్నారు. ఇంటికెళ్లి కోసి తినేటప్పుడు కాని దాని అసలు రంగు బయటపడటంలేదు. మంచి రంగుతో ఉన్న మామిడిపండ్లు రుచిపచీ లేకుండా చప్పగా ఉంటున్నాయి. సహజసిద్ధమైన రుచి, వాసన లేక మామిడి మధురాన్ని వినియోగదారులు అనుభవించలేకపోతున్నారు. దీనికి ప్రధాన కారణం రసాయనాలతో మాగబెట్టడమే. జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు కార్బైడ్‌తో మాగపెట్టిన మామిడిపండ్లను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు మామూళ్లకు మరిగి మండీల వైపు చూడటంలేదనే విమర్శలు ఉన్నాయి.

సహజంగా ఎలా మాగబెడతారంటే..

చెట్ల నుంచి మామిడికాయలు కోశాక ఎండుగడ్డి మధ్యలో ఉంచి గదిలోని గాలి బయటకు పోకుండా వేడిపెంచడం ద్వారా మాగబెడతారు. వారం పదిరోజుల్లో పూర్తిగా మాగి మంచి వాసన, రంగుతో నిగనిగలాడుతాయి. ఈ పద్ధతిలో ఎక్కువ సమయం పడుతుండటంతో ఏదోరకంగా మాగబెట్టి త్వరగా అమ్మిసొమ్ము చేసుకోవాలనే దోరణిలో వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు.



కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడిపండ్లు

వ్యాపారులు ఎలా చేస్తున్నారంటే..

పక్వానికి రాకుండానే మామిడికాయలను కోసేసి వ్యాపారులు కార్బైడ్ పెట్టి మాగబెడుతున్నారు. దీంతో రెండు మూడురోజుల్లోనే కాయలకు నిగనిగలాడే రంగు వస్తోంది. పైకి బాగా కనపడుతున్నా లోపల ఉన్న కండంతా దెబ్బతింటోంది. కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడిపండ్లను తింటే కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు, ఊపిరితిత్తుల సమస్యలే కాక క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఎర్ర రక్తకణాలు దెబ్బతిని రక్తంలో ఆక్సిజన్ తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

నిబంధనలు గాలికి..

ఆహారభద్రతా నిబంధనల మేరకు ఇథలీన్ పౌడర్‌తో మామిడికాయలను మాగబెట్టవచ్చు. పౌడర్ ఉండే కవర్‌కు రంధ్రం చేసి మామిడిపండ్ల మధ్యలో ఉంచడం ద్వారా గాలి బయటకు పోకుండా చూస్తే రెండుమూడురోజుల్లో కాయలు మాగే అవకాశం ఉంది. కార్బైడ్ వాడకంపై నిషేధం ఉంది. కార్బైడ్‌తో మామిడిపండ్లను మాగబెట్టి అమ్మడం నేరం. ఇలాంటి దుశ్చర్యలను అరికట్టాల్సిన ఆహారభద్రతా అధికారులు అటువైపు కూడా కన్నెత్తి చూడడం లేదు.

చర్యలు తీసుకుంటాం



కార్బైడ్‌తో మామిడికాయలను మాగబెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. మండీలను తనిఖీచేసి చర్యలు తీసుకుంటాం. బాధ్యులపై కేసులు నమోదుచేస్తాం. ఎవరైనా ఇలాంటి పద్ధతిలో మామిడికాయలను మాగబెట్టి విక్రయిస్తుంటే మాకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. మా ఫోన్ నంబరు 9703383684కు ఫోన్‌చేసి వివరాలు తెలపవచ్చు. సదరు మామిడిపండ్లను శాంపిల్ తీసి నిబంధనలకు విరుద్ధంగా మాగబెడుతుంటే కేసులు నమోదు చేస్తాం.

-రామచంద్ర, జిల్లా ఆహార భద్రతాధికారి

క్రైం కార్నర్

ఆటోని ఢీకొట్టిన ట్రాక్టర్

● ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు


ఆంజనేయులు(ఫైల్)

బత్తలపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్పుమడుగు క్రాస్ సమీపంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు త్రీవంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు ముదిగుబ్బకు చెందిన ఆంజనేయులు(59), అయన భార్య అలివేలమ్మ కాయగూరల వ్యాపారం చేసుకొని జీవనం సాగించే వారు. కాయగూరలు తెచ్చేందుకు సోమవారం తెల్లవారు జామున ముదిగుబ్బ నుంచి ధర్మవరం బయల్దేరారు. వెల్పుమడుగు క్రాస్ సమీపములో ఆటోను బండలలోడుతో వస్తున్న ట్రాక్టర్ వెనుక నుంచి ఢీకొట్టి, దూసుకుపోయింది. ఆటో నడుపుతున్న ఆంజనేయులు(59) అక్కడికక్కడే మృతిచెందగా అలివేలమ్మ తీవ్రంగా గాయపడింది. వాహనదారులు అలివేలమ్మను ప్రత్యేక వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఒకక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలు పుట్టలేదని యువకుడి ఆత్మహత్య

గోరంట్ల, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చేపల్లికి చెందిన మాజీ వలంటీర్ లోచర్ల చరణ్‌కుమార్ (33) ఉరి వేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు. నరసింహప్ప కుమారుడైన చరణ్‌కుమార్ మొదటి భార్య వదిలివేయడంతో, ఇటీవల అదే గ్రామానికి చెందిన పూజను రెండో పెళ్లి చేసుకున్నాడు. సంతానం కలగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై, ఇంటి సమీపంలోని చింతచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి నరసింహప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మానసిక స్థితి సరిగాలేని మహిళ...

అనంతపురం క్రైం, మే19(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేని ఓ మహిళ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం నగర శివారులోని పాపంపేటకు చెందిన లక్ష్మిదేవి(45)భర్త 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. పదేళ్ల నుంచి ఆమె మానసిక స్థితి సరిగా లేదు. ఈక్రమంలోనే సోమవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమెకు ఇద్దరు కొడుకులు ఉండగా వారికి వివాహాలు అయ్యాయి.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండగా రూరల్ పోలీసులు దాడి చేశారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. కళ్యాణదుర్గం రోడ్డులోని సీవీఆర్ కళాశాల వెనుక వైపు ఉన్న ఇంట్లో తనిఖీలు చేశారు. నిర్వాహకులు షేక్‌హసీనా, సెహనాజ్, ఓ విటుడిని అరెస్ట్ చేశారు. నిర్వాహకులు బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహించేవారని పోలీసులు తెలిపారు.

చిరుత మృతి

మడకశిర, మే 19(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం గుడ్డుగుర్కి గ్రామ సమీపంలోని బద్దికొండపై చిరుత మృతిచెందింది. గొర్రెలను మేపేందుకు సోమవారం కొండకు వెళ్లిన కాపరులు దుర్వాసన వస్తుండడాన్ని గమనించార. కుళ్లిపోయిన చిరుత కళేబరాన్ని గుర్తించారు. వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారి చక్రపాణి, సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, సెక్షన్ ఆఫీసర్ కుల్లాయప్ప, సిబ్బంది అక్కడికి చేరుకుని చిరుత కలేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి, దహనం చేశారు. చిరుతకు పదేళ్ల వయసు ఉంటుందని వారు తెలిపారు. కొండ పక్కనే కర్ణాటక రాష్ట్రంలో మృతిచెందిన చిరుతను గుడ్డుగుర్కి సమీపంలోని కొండపై వేసి ఉంటారని అటవీశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. చిరుత మృతిచెంది ఐదు రోజులు అయి ఉంటుందన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కలెక్టర్ సంతకం ఫోర్జరీ కేసులో ఒకరి అరెస్ట్

అనంతపురం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): నకిలీ అక్రెడిటేషన్, ఐడీ కార్డులు సృష్టించి, వాటిపై జిల్లా కలెక్టర్ డిజిటల్ సంతకం ఫోర్జరీ చేసిన వారిలో మన్నల దేవరాజును వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు... నగరంలో ప్రజాబలం న్యూస్ పేరుతో యూట్యూబ్ చానల్ నడిపే చందులాల్, మన్నల దేవరాజు నకిలీ అక్రెడిటేషన్ కార్డు తయారు చేసి, వాటిపై జిల్లా కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేశారు. ఆ కార్డును ఉపయోగించి ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులను బెదిరించి దౌర్జన్యాలకు పాల్పడినట్లు డీపీఆర్ఓ గురుస్వామిశెట్టి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన వన్‌టౌన్ పోలీసులు సోమవారం మన్నల దేవరాజును అరెస్ట్ చేశారు. చందులాల్‌ను అరెస్ట్ చేయాల్సి ఉంది. ప్రభుత్వ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేయడం, నకిలీ అక్రెడిటేషన్ కార్డులు తయారు చేయడం వంటివి చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నగర శివారులోని నేషనల్ పార్కు ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈనెల 17న రాత్రి బుక్కరాయసముద్రం మండలం సంజీవపురానికి చెందినబీటెక్ విద్యార్థి లోక్‌నాథ్, ప్రియాంకనగర్‌కు చెందిన మహబూబ్‌పీరా బైక్‌లపై వస్తూ ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. బీటెక్ విద్యార్థి తలకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మరింత పెరిగిన చీనీ ధరలు

● టన్ను రూ.40 వేలకుపైగా పలికిన ధర

అనంతపురం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో చీనీ ధరలు మరింత పెరిగాయి. కొన్ని రోజులుగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. రోజు పలుకుతున్న ధర కంటే సోమవారం మరింత పెరిగింది. ఏకంగా రూ.40వేలకుపైగా పలికాయి. గరిష్ఠంగా రూ.42వేలతో టన్ను కాయలు అమ్ముడుపోయాయి. సీజన్ ప్రారంభం నుంచి ఇదే అధిక ధర కావడం గమనార్హం. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.25వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 497 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

భూ తగాదాలతోనే రైతు దంపతుల హత్య

● రూరల్ డీఎస్పీ వెంకటేశులు
● ఆరుగురు నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష

రాప్తాడు, మే 19(ఆంధ్రజ్యోతి): భూ తగాదాలతోనే రాప్తాడు రైతు దంపతులు చిగిచెర్ల నారాయణరెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మ హత్యలు జరిగాయని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గంగలకుంట క్రాస్ వద్ద ఆరుగురు నిందితులను అరెస్టు చేశామని, వారి నుంచి నాలుగు వేట కొడవళ్లు, కట్టెలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో నిందితులు, ఆయుధాలను చూపించారు. రాప్తాడుకు చెందిన చిగిచెర్ల నారాయణరెడ్డికి (హతుడు చిగిచెర్ల నారాయణరెడ్డి తండ్రి) చెందిన 6.20 ఎకరాల భూమిని ఎకరం రూ.15 వేల ప్రకారం రూ.93 వేలకు రాప్తాడుకు చెందిన పుల్లమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మమ్మ కొనుగోలు చేసి, అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు. కానీ నారాయణరెడ్డి ఆ ముగ్గురు మహిళల పేరిట అప్పట్లో రిజిస్ట్రేషన్ చేయించలేదని, దీంతో వారు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. 2012లో కోర్టు ముగ్గురు మహిళలకు ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించిందని, దీంతో చిగిచెర్ల నారాయణరెడ్డి.. ఆ భూమి తన బావ ఓబిరెడ్డి భార్య నారాయణమ్మకు చెందినదని కోర్టును ఆశ్రయించాడని తెలిపారు. అప్పటి నుంచి కోర్టులో విచారణ జరిగి, 2022లో ఆ భూమి ముగ్గురు మహిళలకే చెందిందని కోర్టు నిర్ధారించిందని తెలిపారు. హై కోర్టు కూడా ఇటీవల ఆ భూమి ముగ్గురు మహిళలకే చెందుతుందని ప్రకటించిందని తెలిపారు. హై కోర్టు ఆదేశాలు, జిల్లా రెవెన్యూ అధికారుల ఉత్తర్వుల మేరకు రాప్తాడు తహసీల్దార్ విజయకుమారి ఆ భూమిని ముగ్గురు మహిళల్లో ఒకరైన పుల్లమ్మ పేరిట ఈ నెల 14న ఆన్‌లైన్ చేశారని తెలిపారు. వివాదంలో ఉన్న ఆ భూమిని 2024 అక్టోబరులో ఎకరం రూ.56.50 లక్షలు చొప్పున 6.20 ఎకరాలను ఆ ముగ్గురు మహిళల నుంచి రాప్తాడుకు చెందిన పామళ్ల ధనుంజయ, పామళ్ల కొండప్ప, పామళ్ల ఇంద్రశేఖర్, గోనిపట్ల శీనా, పామళ్ల పండయ్య అలియాస్ కథల పండయ్య, గొల్లపల్లి జగదీష్, లక్ష్మీనారాయణ, నందకుమార్, బుల్లే నగేష్ కొని, అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు. ఈనెల 16న పామళ్ల ధనుంజయ, పామళ్ల కొండప్ప, గోనిపట్ల శీనా, కథల పండయ్య, హనుమంతరెడ్డి, బాల నరసింహారెడ్డి, నిరంజన్‌రెడ్డి, పుల్లమ్మ, కందుకూరు నాగలక్ష్మి, దండు నరేంద్ర, గొల్లపల్లి జగదీష్, గంగలకుంట లక్ష్మీనారాయణ, బుల్లె నగేష్ ఆ భూమిలోకి వెళ్లారని, ఈ భూమిలోకి వస్తే చంపేస్తామని చిగిచెర్ల నారాయణరెడ్డి భార్య ముత్యాల్యమ్మను బెదిరించారని తెలిపారు. ఆ మరుసటి రోజు శనివారం ఉదయం 9:30 గంటలకు ఆ పొలానికి వెళ్లి, ఎక్స్‌కవేటర్‌తో దానిమ్మ చెట్లను తొలగిస్తుండగా... చిగిచెర్ల నారాయణరెడ్డి, ఆయన భార్య ముత్యాలమ్మ, కుమారుడు ప్రదీ ఎకుమార్‌రెడ్డి, బావమరిది ప్రతాప్‌రెడ్డి పొలానికి వెళ్లి అడ్డుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఇరు వర్గాల వారు ఘర్షణ పడ్డారని, ముత్యాలమ్మ, నారాయణరెడ్డిని ప్రత్యర్థులు వేట కొడవళ్లతో నరికారని తెలిపారు. ముత్యాలమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, నారాయణరెడ్డి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడని తెలిపారు. దాడిలో నారాయణరెడ్డి బావమరిది ప్రతాప్‌రెడ్డి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఈ కేసులో రాప్తాడుకు చెందిన పామళ్ల ధనుంజయ, పామళ్ల ఇంద్రశేఖర్, దండు నరేంద్ర, నిరంజన్ రెడ్డి, కందుకూరుకు చెందిన దయ్యం హనుమంతరెడ్డి, గంగలకుంటకు చెందిన బుడగ లక్ష్మీనారాయణను అరెస్టు చేసి రిమాండుకు పంపుతున్నట్లు తెలిపారు. మరో ముద్దాయి పామళ్ల కొండప్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, గొల్లపల్లి జగదీష్, కథల పండయ్య, గోనిపట్ల శీనా, బాలనరసింహారెడ్డి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

పరిటాల కుటుంబ ప్రమేయం లేదు

చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతుల హత్యలో పరిటాల కుటుంబం, ధర్మవరపు మురళి ప్రమేయం లేదని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి శవ రాజకీయాలు చేయకుండా వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. రాప్తాడులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, సర్పంచులు సాకే తిరుపాలు, శీనయ్య, ఉజ్జినప్ప, నరేష్, ఎంపీటీసీ జాఫర్, రవి, మాజీ మండల కన్వీనర్ నారాయణస్వామి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గంగలకుంట కిష్టా, శ్రీనివాస రెడ్డి, నాగరాజు, స్వర్ణక్క, వాటర్‌షెడ్ చైర్మన్ మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, డీలర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. భూ తగాదాల కారణంగానే రైతు దంపతుల హత్య జరిగిందని అన్నారు. ఆ హత్యలను పరిటాల కుటుంబానికి ఆపాదించడం తగదని అన్నారు. రాప్తాడులో ఎక్కడ, ఎవరి హత్య జరిగినా ప్రకాశ్ రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పరిటాల సునీత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, వాటిని చూసి ఓర్వలేక ప్రకాశ్ రెడ్డి రాజకీయం చేస్తున్నారని అన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నా ఆయన చేసిందేమీ లేదని అన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వాన బ్రేక్..!

● నాలుగైదు రోజులుగా భారీ వర్షాలు
● హంద్రీనీవా కాలువ పనులకు ఆటంకం
● ఎక్కడికక్కడ ఆగిపోయిన వైనం


కాలువలోకి చేరిన వర్షపు నీరు


ఆగిన హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు

అనంతపురం క్లాక్‌టవర్, మే 19(ఆంధ్రజ్యోతి): జోరుగా సాగుతున్న హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులకు వర్షంతో ఆటంకం ఏర్పడింది. నెలరోజులుగా కాలువ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నాలుగైదు రోజులుగా ఉరవకొండ నియోజకవర్గం, పైన కురిసిన భారీ వర్షాలకు హంద్రీనీవా కాలవ గట్టు కోతకు గురైంది. వర్షం నీరంతా కాలువలోకి చేరడంతో పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో హంద్రీనీవా అధికారులు, కాంట్రాక్టర్లు పనులను నిలిపేశారు. జూన్ ఆఖరుకు పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో హంద్రీనీవా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు వేగం పెంచారు. ఈ తరుణంలో వర్షం ఆటంకిగా మారింది. రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో పనులను జలవనరుల శాఖ ప్రాజెక్టల సీఈ నాగరాజ, హం ద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ పరిశీలిస్తున్నారు. సీఈ మా ట్లాడుతూ.. కాలువలోకి చేరిన వర్షం నీటిని భారీ మోటార్లతో బయటకు తోడేస్తున్నామనీ, రెండు, మూడు రోజుల్లో పనులను ప్రారంభిస్తామన్నారు. గడువు లోపు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

విరివిగా చెక్‌డ్యాంలు

● రూ.12.13 కోట్లతో 239 నిర్మాణం
● ఇప్పటికే 90 పూర్తి
● రైతులకు బహుళ ప్రయోజనాలు
● పశువులు, పక్షుల దాహార్తికి పరిష్కారం


వెస్ట్ నరసాపురం వద్ద నిర్మించిన చెక్‌డ్యాంలో నీటిని తాగుతున్న గొర్రెలు

అనంతపురం క్లాక్‌టవర్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టి.. భూమిలోకి ఇంకింపచేయడానికి చెక్‌డ్యాంలు ఎంతో ఉపయోగపడుతాయి. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసిన ప్రదేశాల్లో చెక్‌డ్యాంలు నిర్మించాలని ప్రభుత్వం నిర్దేశించింది. వాటర్‌షెడ్ పథకం కింద 2024-26 సంవత్సరం కాలంలో జిల్లాలో 239 చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.12.13 కోట్లు నిధులు కేటాయించారు. ఒక్కో చెక్‌డ్యాం 13,500 క్యూబిక్ మీటర్ల పరిధిలో నిర్మిస్తున్నారు. చెక్‌డ్యాంలో సుమారు 1.35 లక్షల లీటర్ల నీటిని నిల్వచేయవచ్చు. జిల్లా వ్యాప్తంగా 239 చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తి చేస్తే సుమారు 3.22 కోట్ల లీటర్ల నీటిని నిల్వచేసే అవకాశం ఉంది. ఇప్పటి వరకు 90 చెక్‌డ్యాంలు నిర్మించారు. రూ.3.24 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన 149 చెక్‌డ్యాంలను వచ్చే సీజన్‌నాటికి పూర్తి చేయడానికి వాటర్‌షెడ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

చెక్‌డ్యాంతో బహుళ ప్రయోజనాలు

వాగులు, వంకల్లో నీటి ప్రవాహాన్ని, వర్షపు నీటిని నిలిపేందుకు, భూమిలోకి ఇంకింపచేసేందుకు అనువుగా చెక్‌డ్యాంలు నిర్మిస్తారు. వేగంగా వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించి, వంక కోతకు గురికాకుండా అరికడుతుంది. భూగర్భజలాలు పెంచి, చుట్టుపక్కల రైతుల బోరు బావుల్లో నీటిమట్టం పెరుగుతుంది. దీంతో నీటి లభ్యతపెరిగి నిరంతరం పంటలు సాగుచేసుకోవచ్చు. పశువులు, పక్షులకు తాగునీరు, పంట పొలాలకు మందుల పిచికారికి నీరు లభిస్తుంది.

చెక్‌డ్యాంలతో రైతులకు మేలు

వాగులు, వంకల్లో నీటి నిల్వ చేసి నిర్మించే చెక్‌డ్యాంలతో రైతులకు, పొలాలకు ఎంతో మేలు జరుగుతుంది. జిల్లాకు కేటాయించిన 239 చెక్‌డ్యాంలకు గాను ఇప్పటి వరకు 90 పూర్తి చేశాం. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని నిర్మిస్తున్నాం. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపచేసి, భూగర్భ జలాలను పెంచుకోవచ్చు. వేసవిలో అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

-సుధాకర్‌రెడ్డి, ఏపీడీ, వాటర్‌షెడ్

వ్యవసాయ శాఖలో బదిలీలకు శ్రీకారం

● దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వులు
● ఇప్పటి దాకా ఆన్‌లైన్ ఆప్షన్ ఇవ్వని వైనం



అనంతపురం అర్బన్, 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో బదిలీలకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది వ్యవసాయ శాఖలో బదిలీలు జరగలేదు. దీంతో అప్పట్లో ఆ శాఖ అధికారులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఈ ఏడాది ఇతర శాఖలతో పాటు వ్యవసాయ శాఖలో బదిలీలకు అవకాశం ఇవ్వడంతో ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల పూర్తయిన అధికారులు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని నిబంధన విధించారు. ఐదేళ్లలోపు కాల పరిమితి ఉన్న అధికారులు, సిబ్బందికి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. వ్యవసాయ శాఖలో ఈనెల 28వతేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈనెల 25వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్‌లైన్‌లో బదిలీల కోసం ఆప్షన్లు ఇవ్వాలని గడువు విధించారు. ఈనెల 26న అనంతపురం జేడీఏ కార్యాలయంలో జోన్-5 పరిధిలోని జిల్లాల జేడీఏలు అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జేడీఏలు కౌన్సిలింగ్‌కు హాజరుకానున్నారు. సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్‌లైన్‌లో ఇచ్చిన ఆప్షన్‌ను పరిశీలించి, కమిషనరేట్‌కు పంపుతారు. ఏఈఓలు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కిందిస్థాయి సిబ్బంది బదిలీలు జేడీఏ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తారు. ఆయా సిబ్బందికి కౌన్సెలింగ్ తేదీని ఇంకా ఖరారు చేయలేదు. ఇప్పటి దాకా ఆన్‌లైన్‌లో బదిలీల స్థానాలకు ఆప్షన్ ఇచ్చేందుకు సదుపాయం కల్పించలేదు. దీంతో అధికారులు, సిబ్బంది నిరీక్షిస్తున్నారు. దీనిపై జేడీఏ ఉమామహేశ్వరమ్మను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా బదిలీ ప్రక్రియ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

హాస్టల్ వర్కర్ దర్జా

● విద్యార్థులతో మసాజ్ ● సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్



ఉరవకొండ, మే19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో హాస్టల్ వర్కర్ మోహన్.. విద్యార్థులతో మసాజ్ చేయించుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆలస్యంగా వీడియో వెలుగులోకి వచ్చింది. వేసవి సెలవులకు ముందు హాస్టల్లోని విద్యార్థులతో తరచూ మోహన్ మసాజ్ చేయించుకునేవాడని తెలిసింది. వసతి గృహంలో మరుగుదొడ్లను శుభ్రం చేయించడమే కాకుండా విద్యార్థులను దుర్భాషలాడేవాడని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. విషయం ఏఎస్‌డబ్ల్యూఓ, హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు.

వర్కర్ మోహన్‌పై చర్యలు తీసుకోవాలి

విద్యార్థులతో మసాజ్ చేయించుకున్న హాస్టల్ వర్కర్ మోహన్‌పై చర్యలు తీసుకోవాలని పీఎస్ఎఫ్ఐ జిల్లా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు హిరణ్య డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం పీఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులతో మసాజ్ చేయించుకున్న విషయం ఏఎస్‌డబ్ల్యూఓ, వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా, చర్యలు తీసుకోలేదన్నారు. వర్కర్‌నే అధికారులు వెనకేసుకొచ్చారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎస్‌డబ్ల్యూఓ రామ్మోహన్, హాస్టల్ వార్డెన్ జగన్నాథ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో పీఎస్ఎఫ్ఐ నాయకులు దయాచరణ్, హరిచరణ్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

● జిల్లా న్యాయాధికారి భీమారావు


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

అనంతపురం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల పరిధిలో జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని జిల్లా న్యాయాధికారి భీమారావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ ఉమ్మడి జిల్లాకు చెందిన రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. అధిక సంఖ్యలో సమస్యలు పరిష్కారం కావడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కేసుల పరిష్కారం విషయంలో ఏవైనా సందేహాలుంటే డీఎల్ఎస్ఏ కార్యదర్శిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీలు జగదీష్, రత్న, అనంతపురం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హోంగార్డును సత్కరించిన ఎస్పీ

అనంతపురం క్రైం, మే 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన మహిళా హోంగార్డు కృష్ణవేణిని జిల్లా ఎస్పీ జగదీష్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఎస్పీ తన చాంబర్లో ఆమెను సన్మానించారు. పోలీస్‌శాఖకు అనుబంధంగా చేరి మంచి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్ఎస్ఐ జాఫర్, ఏఆర్ఎస్ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.

పీఎస్ఓలకు శిక్షణ

జిల్లాలోని పీఎస్ఓలకు(గన్ మెన్)లకు రెండ్రోజుల పాటు రిఫ్రెష్ కోర్సులు ప్రారంభమయ్యాయి. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి కోర్సులను ప్రారంభించారు. స్థానిక డీటీసీలో ఈ కోర్సులను నిర్వహించనున్నారు. ఫిట్‌నెస్, ముందస్తు జాగ్రత్తలు, డూస్ డోంట్స్, వెపన్‌పై పరిజ్ఞానం, ఫైరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. విజయవాడ ఐఎస్‌డబ్ల్యు విభాగం నుంచి విచ్చేసిన ఆర్ఐ శ్రీనివాసరావు మెలకువలు, సూచనలు చేశారు.

22న బైక్‌ల వేలం

అనంతపురం క్రైం, మే19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 22న ద్విచక్రవాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ శ్రీకాంత్ తెలిపారు. 27 బైక్‌లను వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలవారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

న్యూస్ బాక్స్

నేడు కదిరి మినీ మహానాడు

తనకల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): కదిరి పీవీఆర్ గ్రాండ్‌లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

22న పుట్టపర్తి లో..

పుట్టపర్తిరూరల్: జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి నియోజకవర్గస్థాయి మినీ మహనాడు కార్యక్రమాన్ని ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఒక ప్రటకనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అంజినప్ప, ఎంపీ పార్థసారథి, రాష్ట్రస్థాయి పార్టీ పరిశీలకులు పాల్గొంటారన్నారు. నియోజకవర్గ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పరిటాల సునీత మేనకోడలి ప్రతిభ

మిస్సోరీ సెయింట్‌లూయిస్ స్టేట్‌లో ఎంఎస్ సీటు

ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సోదరుడు ధర్మవరపు మురళి కుమార్తె ఈశాచౌదరి మిస్సోరీ సెయింట్ లూయిస్ స్టేట్‌లోని వాసు యూనివర్సిటీలో ఎంఎస్ సీటు సంపాదించారు. ఈమె ఇంటర్ వరకు బెంగళూర్‌లోని ఇండస్ స్కూల్‌లో చదివారు. అనంతరం అమెరికాలోని ఎస్‌ఎల్‌యూ యూనివర్సిటీలో బీబీఏలో చేరారు. మొత్తం ఎనిమిది సెమిస్టర్లలో 96శాతం మెరిట్ సాధించి.. యూనివర్సిటీలోనే గోల్డ్ హానర్స్‌గా నిలిచారు. అమెరికాలోని బిజినెస్ యూనివర్సిటీల్లో టాప్ 10గా ఉన్న యూనివర్సిటీలో తన కుమార్తె సీటు సాధించినట్లు తల్లిదండ్రులు ధర్మవరపు మురళీ, ధనలక్ష్మీ తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 26వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త బోయ బాలప్ప(35) అనారోగ్యంతో సోమవారం మరణించాడు. అంత్యక్రియల కోసం ఆ వార్డు టీడీపీ నాయకుడు టైలర్ గోపాల్ బాలప్ప భార్య లక్ష్మీనరసమ్మకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహులు, నాగంజి, రషీద్‌ఖాన్, షఫీ, వంశీ,ఉపేంద్ర, బాలక్రిష్ణ, నాగేంద్ర, వెంకటరాముడు, భాస్కర్ పాల్గొన్నారు.

సచివాలయానికి సామగ్రి అందజేత

ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 5వ వార్డు సచివాలయానికి 7వ వార్డు టీడీపీ నాయకుడు బాలం మల్లికార్జున రూ.మూడు వేల విలువైన సామగ్రిని సోమవారం అందజేశారు. ఏ4సైజు పేపర్ బండిల్స్, ఫైల్ ర్యాకెర్స్, పెన్నులు, నోట్‌బుక్స్ తదితర సామగ్రిని అందజేశారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ

ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సోమవారం తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమం కింద నాటుసారా నిర్మూలనకు గట్టిచర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ చంద్రమణి ఉన్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

కదిరిఅర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పొలప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభం అవుతుందని, అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

117 జీవోను రద్దు చేయాలి: ఎస్‌టీయూ

నంబులపూలకుంట, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యావ్యవస్థలో జీవో 117ను రద్దు చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుత ప్రభుత్వం అడ్డగోలుగా పాఠశాలలను విభజించి.. విద్యావ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలను స్వాగతిస్తున్నామని, 1,2 తరగతులలో కూడిని ఫౌండేషన్ పాఠశాలలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలకు తరలించే కేంద్రీకృత విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలను మానుకోవాలని సూచించారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

ముదిగుబ్బ, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త, స్టోర్ డీలర్ అంకె శంకర్‌కు మూడు రోజుల క్రితం విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డాడు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంటి వద్ద ఉన్న శంకర్‌ను సోమవారం టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ ఆ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రామ్మోహన్, రాఘవ, నారాయణస్వామి, స్టూడియో అశోక్ ఉన్నారు.

నేడు రెడ్డిపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

నల్లమాడ, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు కన్వీనర్ మైలే శివశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తారని, అనంతరం వంకరకుంట సమీపంలోని చిన్నమ్మ పరుషలో పాల్గొంటారని తెలిపారు.

ఉపాధి ఏపీఓగా సుధాకర్



ధర్మవరం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండల ఉపాధి హామీ ఏపీఓగా సుధాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ అనీల్‌కుమార్‌రెడ్డి తాడిమర్రికి బదిలీ అయ్యారు. ఓబుళదేవరచెరువు ఏపీఓ సుధాకర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

● 'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోండి

ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సుధాకర్ సూచించారు. పనిచేసిన వాటిని తప్పనిసరిగా కూలి లభిస్తుందన్నారు. ప్రస్తుతం రైతులు ఉపాధిహామీ పథకం కింద పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. మండలవ్యాప్తంగాఈ ఏడాదికి 220 ఎకరాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఆసక్తి గల రైతులు ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లుకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మొక్కల కోనుగోలు బిల్లుతో పాటు నీళ్ల బిల్లు, మెయింటెన్స్ బిల్లులు వర్తిస్తాయన్నారు.

తాడిమర్రిలో భారీ వర్షం

తాడిమర్రి, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో అరగంట పాటుగా భారీ వర్షం కురిసింది. 10.4 మి.మీ. వర్షపాతంగా నమోదైంది. దీంతో మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కునుకుంట్ల, చిల్లవారిపల్లి గ్రామాలకు చెందిన పండ్లతోటల రైతులు వారి పొలాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించుకుంటూ చీని చెట్లను బతికించుకునేవారు. ఇలాంటి సమయంలో వర్షం రావడంతో వారం రోజుల పాటు ట్యాంకర్లకు విరామం ఇచ్చినట్లేనని రైతులు అంటున్నారు.

ఘనంగా బ్రహ్మరథోత్సవం

పెనుకొండ, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీ వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రథప్రతిష్ఠ హోమం, బ్రహ్మరథోత్సవం నిర్వహించారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డులు



ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): కొత్తరేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. సచివాలయాల ద్వారా పౌరసరఫరాల శాఖకు సంబంధించిన ఏడు రకాల సేవలను ఈ నెల ఏడో తేదీ నుంచి ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తకార్డులు అరకొరగా పంపిణీ చేసి సరిపెట్టుకుంది. పైగా కొత్తకార్డులు తీసుకోవడానికి పలు షరతులు విధించింది. వీటికి పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామసచివాలయాల ద్వారా సులభంగా రేషన్ కార్డులు, కార్డులో సభ్యుల చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసుకున్న వారికి జూన్‌లో కొత్త కార్డులు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో అర్హత కలిగిన పేద వారు కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. కార్డులో సవరణలు చేసుకోవచ్చని కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

● క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డులు

ఈ సారి అర్హులైన వారికి క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్‌కార్డులు అందజేయనున్నారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే కుటుంబంలో ఉండే సభ్యుల వివరాలతో పాటు ఆరు నెలల నుంచి వారు తీసుకున్న సరుకుల వివరాలు తెలుస్తాయి. జిల్లాలో 5,66,189 రేషన్ కార్డులున్నాయి. ఇందులో ఇంకా 99,972 మందికి ఈ-కేవైసీ పూర్తికాలేదు. వారంతా ఈకేవైసీ పూర్తి చేసుకు నేందుకు జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు.

● సేవలు ఇవే..

కొత్తకార్డులు పొందవచ్చు, బియ్యం కార్డులో సభ్యుల చేర్పులు, సభ్యుల విభజన, మరణించిన సభ్యులపేర్ల తొలగింపు, కార్డుల సరెండర్, చిరునామా మార్పు, తప్పుగా నమోదైనా ఆధార్ సీడింగ్ దిద్దుబాటు తదితర సేవలు అందుబాటులో ఉన్నాయి.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



అమడగూరు (కదిరి), మే 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని మహమ్మదాబాద్ ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన విద్యుత్ అధికారులు ఏఈ చంద్రనాయక్, లైన్‌మన్ సునీల్ కాలనీలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు తొలగించి.. కొత్త వాటిని ఏర్పాటు చేశారు.

▲ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాగునీటి ట్యాంకులు శుభ్రం



ధర్మవరం రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు పాచి పట్టి.. నీరు కలుషితం అవుతోంది. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో ఎంపీడీఓ సాయిమనోహర్ స్పందించి వెంటనే ఆయా గ్రామపంచాయతీ అధికారులతో మాట్లాడారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసేలా చర్యలు తీసుకున్నారు. పాచిపట్టిన ట్యాంకులతోపాటు పరిసరాలను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేశారు.

ధర్మపురిలో ట్యాంకు వద్ద శుభ్రం చేస్తున్న సిబ్బంది ▲

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చిన అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ 206 అర్జీలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమ శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, పశుసంవర్ధకశాఖ జేడీ సుబదాస్, సిరికల్చర్ జేడీ పద్మావతి, ఎల్‌ఎండీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో..

పుట్టపర్తిరూరల్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 70 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సీఐ సురేష్ పాల్గొన్నారు.

● అధికారుల డుమ్మా

ఓబుళదేవరచెరువు: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ రాబర్టువిల్సన్, ఏపీఓ మంజుల, ఐసీడీఎస్ విజయకుమారి, హౌసింగ్ ఏఈ అరుణ్ కుమార్ మరికొంతమంది మాత్రమే హాజరయ్యారు. 11 శాఖలకు చెందిన అధికారులు డుమ్మా కొట్టారు. ఆ అధికారులతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

● మట్టి తరలింపు అడ్డుకోండి

గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్నారని, మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలని బీఏపీ మండల అధ్యక్షుడు వీరాంజనేయులు సోమవారం ఓడీసీ తహసీల్దార్ అనంతచారికి వినతిపత్రం అందించారు. ఆయన వెంట నాయకులు వెంకటరమణ,అంజనప్ప, శ్రీనివాసులు ఉన్నారు.

● ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి

తనకల్లు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేసి గ్రామాల్లో ఆ సంస్థ సేవలు కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండ్లిపల్లి గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రం సమర్పించారు. 20 యేళ్లుగా తమ గ్రామంలో ఆర్డీటీ విద్య, వైద్యం, పండ్లతోటల పెంపకంలో సహకారం అందిస్తోందన్నారు.

వానొస్తే నీరంతా ఆ ఇంట్లోకే!

ఫోన్ చేసినా స్పందించని కంట్రోల్ రూమ్



వర్షపు నీటిలో మునిగిన ఇల్లు



కొంతవరకు తీసి వదిలేసిన కాలువ

తనకల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ చిన్నపాటి వర్షం కురిసినా... పూజారి గీత, శంకర్‌కు చెందిన ఇంట్లోకి వాన నీరు వస్తోంది. తనకల్లులోని కాలువల్లోని నీరు చిన్నచెరువులోకి మళ్లించాల్సి ఉంది. జాతీయ రహదారి విస్తరణ అధికారులు ఆ కాలువను చౌడేశ్వరీ అమ్మవారి ఆలయం వరకు తీసి వదిలేశారు. దీంతో ఊర్లోని వర్షపు నీరంతా ఆ కాలువ ద్వారా అక్కడికి చేరుకొని.. ముందుకు పోవడానికి వీలులేకపోవడంతో సమీపంలోని పూజారి గీత, శంకర్ ఇంట్లో చేరుతోంది. ఈ సమస్యను వారు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఇటు జాతీయ రహదారుల అధికారులు అటు గ్రామ పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో వాన వచ్చినప్పుడల్లా.. ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఇప్పటికే ఆ ఇల్లు శిథిలావస్థకు చేసుకొని.. సగానికి పైగా పడిపోయింది. గత్యంతరం లేక ఉన్నదాంట్లోనే వారు నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఆ ఇళ్లు పూర్తిగా మునిగిపోయింది. ఇంట్లోకి నీరు ప్రవేశించడంతో రాత్రంతా ఆ కుటుంబం నీళ్లలోనే ఉంటూ.. జాగారం చేయాల్సి వచ్చింది. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు వారు ఫోన్ చేసినా ఫలితం లేకుండా పోయింది. సోమవారం ఉదయం వారు ఇంటి గోడను పగలగొట్టుకొని.. బయటకు వచ్చారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



ధర్మవరంలో

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): దివంగత సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న నాయకులు ఎస్‌హెచ్‌బాషా, మారుతి, జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, వెంకటస్వామి, నారాయణస్వామి, నాగవేణి పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: పుచ్చలపల్లి వర్ధంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆ పార్టీ నాయకులు బాబ్‌జాన్, రామమోహన్, శివ, శాంతిబాయి పాల్గొన్నారు.



కదిరిలో నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

22న హనుమాన్ శోభాయాత్ర

ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం హనుమాన్ శోభాయాత్ర చేపడుతున్నట్లు విశ్వహిందూపరిషత్ విభాగ్ కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్ తెలిపారు. సోమవారం స్థానిక వీహెచ్‌పీ కార్యాలయంలో అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. ఈ శోభాయాత్ర లక్ష్మీచెన్నకేశవపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్, కాలేజ్, కళాజ్యోతి, ఎన్టీఆర్, గాంధీసర్కిల్ మీదుగా తిరిగి కదిరిగేటు వరకు నిర్వహిస్తామన్నారు. హిందూవులు అధిక సంఖ్యలో ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ విభాగ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలిశెట్టి వెంగముని, జిల్లా బజరంగ్ దళ్ సంయోజక్ మురళీమోహన్‌రెడ్డి, ప్రఖండ కార్యదర్శి దేవరకొండ రామానుజులు, ఆర్‌ఎస్‌ఎస్ ఖండ సభ్యులు ఉపాధ్యాయ అన్నం అరవిందు, బండ్లపల్లి నారాయణమూర్తి పాల్గొన్నారు.

వేసవిలో దుక్కులతో అధిక దిగుబడి

ముదిగుబ్బ ఏఓ లక్ష్మీనరసింహులు

ఇంటర్వ్యూ interview



ముదిగుబ్బ, మే 19(ఆంధ్రజ్యోతి): వేసవి ముగిసి.. వర్షాకాలం రాబోతోంది. ఈ నేపథ్యంలో రైతులు చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ అధికారి (ఏఓ) లక్ష్మీనరసింహులును ఆంధ్రజ్యోతి ఆరా తీసింది. ఆయనతో మాటా.. మంతి ఇలా సాగింది.

ప్రశ్న: వేసవి లోదుక్కుల వల్ల ప్రయోజనం

జవాబు: వేసవి లోదుక్కులు దున్నడం వలన భూమి లోపల ఉండే చీడ, పీడలు పీపా దశలో బయటికి వచ్చి ఎండ వేడిమికి చనిపోతాయి. వర్షం పడినప్పుడు లోతుగా నీరు ఇంకి.. నీరు నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. భూసారం కూడా పెరిగింది. దిగుబడి రెట్టింపు అవుతుంది.

ప్రశ్న: రైతు రిజిస్ట్రేషన్ ఎంతవరకు జరిగింది

జవాబు: మండలంలో 17,150 మంది రైతులు ఉండగా, పీఎం కిసాన్ జమ అయ్యే రైతులు 13,500 మంది ఉన్నారు. వారిలో ఇప్పటివరకూ 12100 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇంకా దాదాపు ఐదు వేలమంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. వీరంతా కేరళ, కర్ణాటక, తెలంగాణకు ఉపాధి కోసం వలస వెళ్లారు.

ప్రశ్న: పచ్చిరొట్టి సాగుకు ఎరువులు ఎప్పుడు ఇస్తారు

జవాబు: ఈ నెల ఆఖరిలో పచ్చిరొట్టె, జీలుగు, జనుము, పిల్లి పెసరలు 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తాం. సాగుకు 45 రోజులు ముందు వీటిని పొలంలో చల్లి బాగా కలియ దున్నడంతో, భూమిలో బాగా కుళ్లి సేంద్రీయ ఎరువుగా మారుతుంది. ఇది భూమికి ఎంతో సారం ఇస్తుంది.

ప్రశ్న: విత్తన కాయలు ఎప్పుడు పంపిణీ చేస్తారు

జవాబు: మండలంలోని రైతులకు వేరుశనగ, కంది, పెసర్లు జూన్ నెలలో సబ్సిడీతో ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ చేస్తాం.

మృతుడి వివరాలు లభ్యం

ధర్మవరం, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కురుబ కల్యాణ మండపం వెనుక ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్టు హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన బుక్కరాయసముద్రపు శ్రీనివాసులుగా గుర్తించినట్టు తెలిపారు. ఈయన బార్బర్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడని, 20 ఏళ్ల నుంచి గుండెపోటు, బ్రైన్‌స్ట్రోక్‌తో బాధపడుతున్నాడని తెలిపారు. అనంతపురం, బెంగుళూర్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా.. ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. శ్రీనివాసులుకు భార్య అనంతమ్మ, కుమారుడు వరుణ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని తెలిపారు.

తల్లీబిడ్డను కాపాడుకుందాం

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం

పుట్టపర్తిరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): సమష్టిగా పని చేసి తల్లీబిడ్డను కాపాడుకుందామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం పేర్కొన్నారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మాతాశిశుమరణాలపై జిల్లాస్థాయి సమీక్షాసమాశాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలో వివిధ ఆసుపత్రులలో ఏప్రిల్ నెలలో సంభవించిన ఆరు శిశుమరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. లోపాలను సరిచేసుకుని సమష్టిగా పని చేసినట్లయితే తల్లీబిడ్డలను కాపాడుకోవచ్చన్నారు. ప్రతినెలా తొమ్మిదో తేదీన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో జరిగే ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ సందర్భంగా గర్భిణులకు గ్రూపు సమావేశం నిర్వహించి ఆరోగ్య విద్య అందించాలన్నారు. హైరిస్క్ గర్భవతులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని, పర్యవేక్షక సిబ్బందితో కాన్పు అయ్యేంత వరకు వారిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ నాగేంద్రనాయక్, డాక్టర్ సునీల్, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, డాక్టర్ నేహా తబుసుం, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కార్తీక్, ఐసీడీఎస్ సీడీపీఓ గాయత్రి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



కల్యాణ వేదికపై కొలువుదీరిన సీతారాములు



ప్రతిష్ఠించిన విగ్రహాలు

నంబులపూలకుంట, మే 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధనియాన్ చెరువు పాతూరులో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో హనుమాన్ సమేత సీతారామలక్ష్మణుల విగ్రహాలను సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణం వీక్షించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు హోమాలు, పూజలు నిర్వహించారు.

నియామకం



శరత్‌కుమార్ రెడ్డి

కదిరిఅర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ కిసాన్ మోర్చా గ్రామ పంచాయతీ కమిటీ రాయలసీమ ఇన్‌చార్జిగా తనను నియమించినట్లు పట్టణానికి చెందిన చింతా శరత్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి, రైతు సమస్యలను గుర్తించి, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులకు అందేలా కృషి చేస్తానన్నారు.

న్యూస్ బాక్స్

పొలాల్లో దర్శనమిచ్చిన ఆరుద్ర పురుగులు


కోడూరు పొలాల్లో కనిపించిన ఆరుద్ర పురుగులు

చిలమత్తూరు, మే 19(ఆంధ్రజ్యోతి): రైతులు అదృష్టంగా భావించే ఆరుద్ర పురుగులు పొలాల్లో దర్శనమిస్తూ అందరినీ ఆనందిపజేస్తున్నాయి. ఎర్రటి రంగులో మెరిసే ఈ ఆరుద్ర పురుగులను ప్రజలు చంద్రమ్మలు అని అంటుంటారు. ముంగార్ల సేద్యం ప్రారంభంలో ఇవి పొలాల్లో దర్శనమిస్తుంటాయి. సాధారణంగా ఆరుద్ర కార్తెలో ఈ అందమైన ఎర్రటి పురుగులు వర్షం కురిసిన మరుసటి రోజు పొలాల్లో దర్శనమిస్తాయి. అయితే ఆరుద్ర కార్తె రాక మునుపే ఇవి పొలాల్లో దర్శనమివ్వడం రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఈ పురుగులు ఆరుద్ర కార్తెలో పొలాల్లో దర్శనమిస్తే ఆ ఏడు వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండుతాయని రైతులు భావిస్తారు. ఈ పురుగులు సోమవారం కోడూరు సమీపంలోని పొలాల్లో దర్శనమిచ్చాయి.

మినీ మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

అగళి, మే19(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గ కేంద్రంలో సోమవారం జరిగిన మినీ మహానాడుకు అగళి జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమార్‌స్వామి ఆధ్వర్యంలో వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.

సీసీ రోడ్డు నాణ్యత తనిఖీ

అమరాపురం, మే 19(ఆంధ్రజ్యోతి): మండలం హేమావతి పంచాయతీ పరిధిలోని గొల్లమరపల్లి, కెంపనహట్టి, హొసహట్టి గ్రామాల్లో నిర్మించిన సిమెంటు రోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. కాంట్రాక్టర్ రామచంద్రప్ప నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు.

ప్రత్యేక పిల్లల భవితకు ప్రభుత్వం భరోసా


వివరాలు సేకరిస్తున్న అధికారులు

పరిగి, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్ల ల భవితకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎంఈఓ లక్ష్మీదేవి అన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల ఉన్న పిల్లలను గుర్తించేందుకు సర్వే చేపట్టామన్నారు. మండలంలోని సీతారామపురం కాలనీలో సర్వే నిర్వహించారు. అంగవైకల్యం ఎక్కువ ఉన్న పిల్లలకు ఇంటివద్దే చదివించడానికి జాగ్రత్తలు తీసుకుని ప్రతిభ ఐఆర్‌పీ ఇంటివద్ద చదువు కొనసాగిస్తామన్నారు. పిల్లలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని సూ చించారు. 21 రకాల వైకల్యం ఉన్న పిల్లలను గుర్తించారన్నారు. పిల్లల పేర్లు నమోదుచేసి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఐఆర్‌పీ రేవతి, సీఆర్‌పీ అపర్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపల్లిలో తాగునీటి సమస్య

మడకశిర రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపల్లి బీసీ కాలనీలో ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఉన్న బోరులో నీటిమట్టం తగ్గిపోవడం, సింగల్ ఫేస్ మోటారు అమర్చడంతో నీరు రావడంలేదు. దీంతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రత్యేక చొరవతో బోరువేయించారు. నెలరోజులు అవుతున్నా నేటికీ అధికారలు బోరుకు మోటారు అమర్చకపోవడంతో నిరుపయోగంగా మారింది.

బొగ్గు బస్తాల పట్టివేత

సోమందేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లి సమీప పొలాల్లో అక్రమంగా కాల్చిన బొగ్గును స్వాధీనం చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. జాతీయ మానవ హక్కులు, సంస్కృతి, ప్రకృతి అభివృద్ధి సంస్థ దక్షిణ భారత అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 14న అక్రమ బట్టీలను అడ్డుకున్నారు. అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని బొగ్గు బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అటవీ శాఖ సెక్షన్ అధికారి శివరామ్ మాట్లాడుతూ.. 200 బొగ్గు బస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మహారాష్ట్ర వాసిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

వ్యాపారి ఇంట్లో చోరీ

సోమందేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ద్వారకామయి నగర్‌లో నివాసముంటున్న స్టీల్‌సామాన్ల వ్యాపారి అథీక్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దీనిపై బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు అథీక్ కుటుంబసమేతంగా ఆదివారం స్వగ్రామానికి వెళ్లాడన్నారు. రాత్రి దొంగలు పలు ఇళ్లలో చోరీకి యత్నించారన్నారు. అథీక్ ఇంట్లో చొరబడి బీరువా పగలకొట్టి నాలుగు బంగారు చేతి ఉంగరాలు, జత కమ్మలు, కాళ్లపట్టీలు, రూ.4వేలు నగదును దొంగిలించినట్లు ఏఎస్ఐ మురళి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిందితుల అరెస్టు

మడకశిర టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): పావగడ తాలూకా రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఒక మహిళ నుంచి నగలు దోచుకున్న కేసులో సోమవారం పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. సీఐ నాగేష్ బాబు తెలిపిన మేరకు మడకశిర మండల గోవిందాపురం గ్రామానికి ఓ శుభకార్యానికి వచ్చిన మహిళ తిరుగు ప్రయాణంలో బస్సు కోసం వేచి ఉండగా, తానూ పావగడకు వెళ్లుతున్నట్లు అశోక్ అనే వ్యక్తి నమ్మబలికి తన ద్విచక్రవాహనంలో ఆమెను ఎక్కించుకున్నాడు. ఆమిదాలగొంది సమీపంలోని క్వారీ వద్దకు తీసుకెళ్లి ఆమెను కత్తితో బెదిరించి కమ్మలు, తాళిబొట్టు, లక్ష్మీబొట్టు, బంగారు పూసలతో కూడిన నల్ల పూసలుదండని లాక్కొని ఆమెను అక్కడే వదిలి మోటర్ సైకిల్‌పై వెళ్లినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని, అందులో భాగంగా సోమవారం టీడీ పల్లి క్రాస్‌వద్ద అదే గ్రామానికి చెందిన ఆర్.అశోక్‌కుమార్, సహకరించిన హెచ్.ఆర్.పాళ్యం గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ, మల్లికార్జులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్దను బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైలుకింద పడి వృద్ధురాలి మృతి

హిందూపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మాల అంజినమ్మ(69)అనే వృద్ధురాలు రైలుకింద పడి మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ సజ్జప్ప తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వచ్చిన ఆమె మోడల్‌కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్‌పై రైలుకిందపడింది. మృతురాలివద్ద ఉన్న ఆధారాలతో అంజినమ్మగా గుర్తించారు. అయితే మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.


మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారథి


పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బడుగుల అభ్యున్నతికి పాటుపడిన ఎన్టీఆర్

● మినీ మహానాడులో ఎంపీ బీకే పార్థసారథి

మడకశిర టౌన్, మే19(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ భవిషత్తును ప్రసాదించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. సోమవారం మడకశిరలో జరిగిన మినీమహానాడులో ఎంపీ పాల్గొని మాట్లాడారు. మొదట ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి, జిల్లా అధ్యక్షుడు అంజినప్పలతో కలసి ఎంపీ మాట్లాడారు. టీడీపీని ఎన్టీఆర్ స్థాపించి పేదల అభ్యున్నతికి కృషి చేశారని, ఆయన అడుగు జాడల్లోనే నడుస్తూ సీఎం చంద్రబాబుసైతం పాలనలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తెస్తూ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నరన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం. 2024కు ముందు ఆ తర్వాత అనేలా మడకశిరను అభివృద్ధి చేసి చూపుతాం. 50 ఏళ్లుగా నెల కొన్న సమస్యలను సైతం పరిష్కరించాం. సీఎం చంద్రబాబు సహకారం వల్ల రాష్ట్రంలోనే మడకశిరను అగ్రభాగంలో నిలపాలన్నది లక్ష్యం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. పారిశ్రామికంగా మడకశిరను అగ్రగామిగా నిలిపేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాం.

అభివృద్ధి పథం వైపు అడుగులు: గుండుమల

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధివైపు అడుగులు వేస్తోంది. ఎమ్మెల్యే కేవలం 15రోజుల్లోనే నియోజకవర్గ ప్రజలు అక్కున చేర్చు కొని గెలిపించారు. మీరు పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి కృషి చేస్తున్నాం. కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది.

వాగ్దానాలు అమలు చేస్తున్నాం: అంజినప్ప

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, వాగ్దానాలు, సూపర్‌సిక్స్ వంటి పథకాలు అమలు చేస్తున్నాం. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ నియోజవకర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాక్రిష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, వీఎం పాండురంగప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, కన్వీనర్లు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు కొనసాగిద్దాం


సోమందేపల్లిలో పుచ్చలపల్లి చిత్రపటం వద్ద జోహర్లు అర్పిస్తున్న నాయకులు

సోమందేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు కొనసాగిద్దామని సీపీఎం నాయకులు అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన 40వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. మండల కార్యదర్శి రంగప్ప, పెద్దన్న, కొండా వెంకటేశులు, బెస్త కిష్టప్ప, నాగభూషణం, మహబూ, తుంగోడు వెంకటేశు, గోవిందప్ప, ఈడిగ నాగరాజు, శీన, ఆంజనేయులు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

గోరంట్ల: పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని మండలంలోని పాలసముద్రం కాలనీలో కార్మిక సంఘాల నాయకులు సోమవారం జరుపుకున్నారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, రామాంజనేయులు, కాలనీవాసులు ఆంజనేయులు, అంజలి, అచ్చమ్మ, సూరమ్మ పాల్గొన్నారు.

పెనుకొండ: పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం స్థానిక సివిల్‌సప్లై గోడౌన్‌వద్ద మండల కన్వీనర్ బాబావలి, హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో కార్మికులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. సుధాకర్, హనుమంతు, శివ, ముత్యాలు, ఓబులేసు, హనుమంతు, అక్కులప్ప, రామచంద్ర పాల్గొన్నారు.


పెనుకొండలో..

మినీ మహానాడుకు తరలిరండి

గోరంట్ల, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో బుధవారం పెనుకొండలోని మడకశిర రోడ్డులో నిర్వహించే మినీ మహానాడుకు పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని టీడీపీ కన్వీనర్ సోముశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ ఆవిర్భావంనుంచి మే నెలలో మినీమహానాడు జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. నియోజకవర్గస్థాయి మినీ మహానాడులు నిర్వహిస్తున్నారు. పెనుకొండలో బుధవారం ఉదయం 11 గంటలకు మినీమహానాడుకు నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

పెనుకొండ టౌన్: మంత్రి సవిత ఆధ్వర్యంలో నిర్వహించే మినీమహానాడును జయప్రదం చేయాలని టీడీపీ కన్వీనర్ శ్రీరాములు కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకుల సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని మే నెలలో మినీ మహానాడు జరుగుతుందన్నారు. బుధవారం పెనుకొండలోని స్థానిక పార్టీ కార్యాలయంలో మినీ మహానాడు నిర్వహిస్తారన్నారు. సిద్దయ్య, నారాయణస్వామి, శ్రీనివాసులు, పాలడుగు చంద్ర, బాబుల్‌రెడ్డి, చంద్రకాంతమ్మ, గోపాల్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పీఎం మోదీ క్రికెట్ టోర్నీ ప్రారంభం

పరిగి, మే 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో పీఎం నరేంద్రమోదీ క్రికెట్ టోర్నీ పేరుతో దివ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరిగి వేణుగోపాల్ రావు క్రికెట్ టోర్నీని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ రంగడు యాదవ్ బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభించారు. వారం రోజులు నిర్వహించే టోర్నీలో గెలుపొందిన వారికి రూ.10వేలు, రన్నర్స్ రూ.5వేలు, క్రీడాకారులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ యువత క్రీడల్లో మక్కువ పెంచుకుంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండవచ్చన్నారు. క్రీడల్లో పాల్గొనడంవల్ల మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. మండల కన్వీనర్ మూర్తి, శివ, అశ్వత్థ, ప్రసాద్, ఉదయ్, చంద్ర, వడిసలప్ప, ప్రీతమ్ పాల్గొన్నారు.

ఆర్డీటీని పరిరక్షించాలని ర్యాలీ



ర్యాలీ చేస్తున్న స్థానికులు

గోరంట్ల, మే19 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల్లో సేవలందిస్తున్న ఆర్డీటీని పరిరక్షించాలని స్థానికులు సోమవారం ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయుడు జగదీష్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజలు, ఆర్డీటీ సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. కదిరిరోడ్డు నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ కొనసాగించారు. ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆగిపోయిన నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న రూసా కమిటీ సభ్యులు

పెనుకొండ, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాలు, మరమ్మతు పనులను ఏపీ రూసా ప్రాజెక్టు డైరెక్టర్, కమిటీ సభ్యులు సోమవారం పరిశీలించారు. 2019లో కేంద్ర ప్రభుత్వం రూ.1.4కోట్లు నిధులు విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ఒకే టెండర్ రావడంతో కాంట్రాక్టర్ విజయలక్ష్మి పనులను ప్రారంభించారు. సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఏపీ రూస డైరెక్టర్, నలుగురు సభ్యులతో కమిటీని నియమించారు. ఈ కమిటీ సభ్యులు సోమవారం ఆగిపోయిన పనులను పరిశీలించారు. అనంతరం ఇంజనీర్లు మాట్లాడుతూ పనులకు సంబంధించి రీ ప్రపోజల్ తయారుచేయాలని కాంట్రాక్టర్ తిరిగి కొనసాగిస్తామని ధ్రువీరణ చేయాలన్నారు. ఆగిపోయిన పనులను పునరుద్ధరించాలని సూచించారు. తనిఖీకి వచ్చిన కమిటీ సభ్యులు ఆర్‌జేడీ డాక్టర్ నాగలింగారెడ్డి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీమోహన్, ఉన్నత విద్య కార్యాలయం నుంచి తిరుపతిరావు, శంకర్‌రావు ఉన్నారు. వీరివెంట కళాశాలప్రిన్సిపాల్ కేశవరావు, జయప్ప, హరీష్ బాబు, యశోధరాణి, శ్రీనివాసులు ఉన్నారు.

నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- హైవేపై బోల్తాపడ్డ కారు
- ముగ్గురు తుమకూరు జిల్లావాసుల మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు

పావగడ, మే19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా డోన్ పరిధిలోని ప్యాపిలి మండలం పోతుదొడ్డి హైవే రోడ్డులో ఆరుగురు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు సోమవారం తెల్లవారుజామున అదుపుతప్పి బోల్తాపడటంతో ముగ్గురు మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి తాలూకా హుళియార్, హోబళి, కెంకెర గ్రామాలకు చెందిన సంతోష్, నవీన్, లోకేష్, స్వామి, దర్శన్, శశిధర్ అనే స్నేహితులు రెండు రోజుల క్రితం మంత్రాలయానికి వెళ్లి ఆదివారం రాత్రి శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకుని సోమవారం ఉదయం 5గంటలకు తిరుగు ప్రయాణం అయ్యారు. నంద్యాల జిల్లా డోన్ దగ్గర కారు బోల్తాపడింది. ప్రమాదంలో నవీన్(43), లోకేష్(36), సంతోష్(35) అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి సోమవారం సాయంత్రం బంధువులకు పోలీసులు అప్పగించారు. ముగ్గురు మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.


ప్రమాదంలో దెబ్బతిన్న ఇన్నోవా కారు


నవీన్, లోకేశ్, సంతోష్ (ఫైల్)

మృతుల వివరాలు..

నవీన్ చిక్క నాయనహళ్లి తాళ్లూరు పంచాయతీ మాజీ అధ్యక్షుడిగా ఉండి భార్య కావ్య, మూడు సంవత్సరాల కుమారుడిని విడిచి వెళ్లారు. సంతోష్ బీజేపీ యువ నాయకుడిగా ఉంటూ కాంట్రాక్టర్ పనులు చేస్తూ ఉండేవాడు. ఇతనికి ఐదేళ్ల కుమారుడు, భార్య లక్ష్మీ ఉన్నారు. లోకేష్ చిన్నప్పటి వ్యాపారం చేస్తుండేవాడు. ఇతనికి భార్య ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

ఘనంగా వెంకటరమణ స్వామి బ్రహ్మరథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెనుకొండ, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి 119వ బ్రహ్మరథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆగమికులు రాజీవ్‌ఆచార్యులు, మధుసుదనాచార్యులు, రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, విద్యారాధన, సహస్రనామార్చనలు, విద్యాహోమం, బలిహరణ, మధ్యాహ్నం 12గంటల నుంచి రథప్రతిష్ఠ హోమం, బ్రహ్మరథోత్సవం నిర్వహించారు. అశేష సంఖ్యలో భక్తులు హాజరై రథోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం విద్యాహోమం, బలిహరణం, బ్రహ్మరథ పుష్పవిమానోత్సవం, మహామంగళహారతి తీర్థప్రసాద వినియోగం గావించారు. బ్రాహ్మణ అన్నసంతర్పణ చేపట్టారు. అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రగతి శ్రీనివాసులు, యాడికి నాగరాజు, సుధాకర్‌గుప్తా, ఆలయ వంశపారంపర్య కార్యదర్శి వెచ్చం పద్మనాభయ్యగుప్తా, కుమారుడు అమర్నాథ్‌గుప్తా పాల్గొన్నారు.

వైభవంగా వాల్మీకి విగ్రహ పునఃప్రతిష్ఠ


కలశాన్ని మోస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

హిందూపురం, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వెలసిన వాల్మీకి ఆలయంలో స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. రెండురోజుల పాటు వివిధ పూజలు, అర్చనలు, అభిషేకాల అనంతరం సోమవారం వేదపారాయణం, యాగశాలఅర్చన, మహాకుంభాభిషేకం నిర్వహించారు. మహాపూర్ణాహుతి, యాత్రదానం, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి విశేష అలంకరణచేశారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ రమేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, ఆదినారాయణప్ప, వెంకటరమణ, రాజు, కొల్లకుంట శివశంకర్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, టీడీపీ నాయకులు నాగరాజు, సంతేబిదునూరు శ్రీరాములు, ఆదినారాయణ, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థరెడ్డి, లోకేష్, హనుమంతు, నరసింహులు పాల్గొన్నారు. పురం వైసీపీ ఇన్చార్జ్ దీపిక, నాయకులు వేణురెడ్డి, వాల్మీకి లోకేష్, పాల్గొన్నారు.


స్వామిని దర్శించుకుంటున్న వాల్మీకి సంఘం నాయకులు

ప్రభుత్వ పాఠశాల ప్రహరీ ధ్వంసం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు


ధ్వంసమైన ప్రహరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ

గోరంట్ల, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మార్సీ వద్దనున్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ఆదివారం ధ్వంసం చేయడంతో ఎంఈఓలు జాన్‌రెడ్డెప్ప, గోపాల్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 225-1లోని 4.09 ఎకరాల్లో కదిరి ప్రధాన రహదారి పక్కన పూర్వం బీఎస్ఎన్ఎల్, ఆసుపత్రి భవనాలు, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, వ్యవసాయ గిడ్డంగి, ప్రాథమిక పాఠశాల, ఎమ్మార్సీ భవనాలు నిర్మించారు. తూర్పున చౌడేశ్వరీ కాలనీ వైపు స్థలంలో 1996లో రెండు సెంట్ల స్థలాన్ని శివప్ప అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. ఇప్పటివరకు మౌనంగా ఉండి, పూర్వం కట్టిన ప్రహరీ తమ స్థలంలో ఉందంటూ కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. గోరంట్ల రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించి సర్వే చేశారు. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు వెలువడకుండానే శివప్ప ఎక్సకవేటర్‌తో వంద అడుగుల మేర ప్రభుత్వ ప్రహరీని ఆదివారం కూల్చివేశాడు. విషయం తెలిసి ఎంఈఓలతోపాటు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చర్యలకోసం పోలీసులతో సంప్రదించారు. పాఠశాల హెచ్ఎం విద్యాసాగర్ పోలీసులు, తహసీల్దార్ మారుతికి గోడ కూల్చివేతపై లిఖితపూర్వగా ఫిర్యాదు చేశారు.

ఘనంగా తిరంగా ర్యాలీ


తిరంగా ర్యాలీలో పాల్గొన్న వేణుగోపాల్‌రావు, ప్రజలు

పరిగి, మే 19(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో దానికి మద్దతుగా మండలకేంద్రంలో జాతీయ జెండాలు చేతబట్టి ప్రజలు ర్యాలీ నిర్వహించారు. సోమవారం ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్ నుంచి పైడేటి సర్కిల్ వరకు బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంకోసం శ్రీసత్యసాయిజిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన జవాన్ మురళీనాయక్ యుద్ధంలో వీరమరణం పొందాడన్నారు. దేశవ్యాప్తంగా పలువురు సైనికులు వీరమరణం పొందారన్నారు. భారత్‌మాతకు జై అంటూ నినాదాలుచేస్తూ కార్మికులు స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారు. బీజేపీ మండల కన్వీనర్ వెన్నల మూర్తి, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు వద్దె హనుమయ్య, మాజీ సైనికులు, గార్మెంట్స్ బీజీఎం సురేష్, కార్తీక్ పాల్గొన్నారు. ఎస్ఐ రంగడు యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది భద్రతను పర్యవేక్షించరు.

సచివాలయ సిబ్బందిని మందలించిన ఎంపీడీఓ

సోమందేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి సచివాలయాన్ని సోమవారం ఎంపీడీఓ వెంకటలక్ష్మి తనిఖీచేశారు. సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందించాలని మందలించారు. ఇటీవల ఆంధ్రజ్యోతి విజిట్‌లో భాగంగా సచివాలయంలో అందుబాటులోని సిబ్బంది అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆమె కార్యదర్శి రామాంజనేయులుతో కలిసి సచివాలయాన్ని సందర్శించి శాఖలవారిగా సిబ్బంది పనితీరు బయోమెట్రిక్‌పై ఆరాతీశారు. వర్షాలు పడుతున్నందున సిబ్బంది సచివాలయంలో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని తనకు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో నిర్మించిన పశువుల తొట్టెను, చెత్తతో సంపద కేంద్రాన్ని పరిశీలించారు.


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ